క్లుప్తంగా

హనుమంతుడికి నాగవల్లీ దళార్చనలు



పూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాల పురంలో గల శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో స్వామివారికి నాగవల్లీ దళార్చనలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, ప్రాంతఃకాల అర్చన, మాన్యసూక్త మంత్రంతో అభిషేకం, సహస్ర నామార్చన, ఆరగింపు, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ చలపతి, అర్చకులు ముదుంబై అన్వేష్‌కుమార్ చార్యులు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



జయరాజుకు ఆర్థికసాయం అందజేస్తున్న ఆదూరి కిషోర్‌రెడ్డి

మఠంపల్లి : మండల కేంద్రానికి చెందిన వార్డు మాజీ సభ్యుడు మామిడి జయరాజు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటివద్ద ఉంటున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల నాయకుడు ఆదూరి కిషోర్‌రెడ్డి.. బాధితుడి ఇంటికి వెళ్లి రూ.7వేలు ఆర్థికసాయం అందజేశారు. అదే విధంగా అసంపూర్తిగా నిర్మించిన స్థానిక చర్చి పాస్టర్ జాన్ పుల్లారావు ఇంటిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బాధిత కుటుంబాల పరిస్థితి మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటామన్నారు. ఆయన వెంట వీహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు ఏసుమళ్ల రాములు, వల్లపుదాస్ జోస్‌గౌడ్, వినయ్, వినోద్ తదితరులు ఉన్నారు.

నేడు గరిడేపల్లిలో సంక్షేమ పథకాల అమలు ప్రారంభం

గరిడేపల్లి : రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలుకు ఆదివారం ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. సంక్షేమ పథకాలు ప్రారంభించేందుకు మండలంలోని గరిడేపల్లి గ్రామాన్ని అధికారులు ఎంపిక చేశారు. ఆదివారం గరిడేపల్లిలో గ్రామ సభ నిర్వహించి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలకు సంబంధించిన ఆర్డర్ కాపీలు అందజేయనున్నారు.

నేడు మాంసం విక్రయాలు బంద్

హుజూర్‌నగర్ : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మున్సిపాలిటీ పరిధిలో మాంసం విక్రయాలు నిర్వహించరాదని హుజూర్‌నగర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని చికెన్, మటన్, చేపలు, ఇతర మాంసం దుకాణాలు బంద్ చేయాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

మునగాల : మండలంలోని నాలుగు క్లస్టర్ల పరిధిలో 01- జనవరి- 2025లోపు కొత్తగా భూములకు పట్టాలు పొందిన రైతులు, పాసు పుస్తకం ఉండి గతంలో రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోని రైతులు ప్రస్తుతం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బుంగా రాజు తెలిపారు. శనివారం మునగాలలోని కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దరఖాస్తుదారులు రైతు భరోసా దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జీరాక్స్ ప్రతులను జత చేసి ఇవ్వాలన్నారు. రైతుభరోసా పథకానికి బ్యాంకు ఖాతా నంబర్ మార్పు, ఖాతాను మార్చాలనుకుంటనే తిరిగి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

సమావేశం 28కి వాయిదా

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో శనివారం కార్మికుల వేతన పెంపుపై జరగాల్సిన జాయింట్ చర్చలు వాయిదా పడినట్లు కార్మిక సంఘం నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశాన్ని తిరిగి 28న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఎలక్ట్రిక్ స్టవ్ అందజేత



ఎలక్ట్రిక్ స్టవ్ అందజేస్తున్న మాజీ సర్పంచ్ అరుణ్‌కుమార్ దంపతులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న పశు వైద్యశాలకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్- రాధికా దేశ్‌ముఖ్ దంపతులు ఎలక్ట్రిక్ స్టవ్‌ను డాక్టర్ ప్రమీలకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు యరగాని భిక్షం, సోమగాని నగేశ్వరరావు, వెంకన్న నరేష్ ఉన్నారు.

ఆత్మీయ భరోసా పథకంపై రగడ

- జాబితాలో తమ పేర్లు లేకపోవడంపై భూమి లేని పేదల ఆగ్రహం
- 'ఉపాధి' పనులు కల్పించకపోవడంతోనే తాము ఎంపిక కాలేదని ఆవేదన
- గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేక ఐదేళ్లు
- ఉపాధి పనులు చేయించడంలో ఓ మేటు కీలక పాత్ర
- తమవారికే పని కల్పించాడని ఆరోపణలు



గ్రామసభలో అధికారులతో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు (ఫైల్)



ఉపాధి పనుల సమాచారం ఇవ్వాలని ఎంపీఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

చిలుకూరు : మండల కేంద్రమైన చిలుకూరు గ్రామంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంపై రగడ జరుగుతోంది. భూమి లేని నిరుపేదలను ఎంపిక చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నారు. ఐదేళ్ల క్రితం ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెండ్ అయ్యారు. నాటి నుంచి ఉపాధి హామీ పనులు చేయించడంలో కీలకంగా ఉన్న సీనియర్ మేటు తమ వారికే ఉపాధి హామీ పని దినాలు కల్పించాడని, దీంతో ఆత్మీయ భరోసా పథకానికి తాము ఎంపిక కాలేదని పేదలు ఆరోపిస్తున్నారు.

గ్రామసభలో ఆందోళన..

ఆత్మీయ భరోసా పథకానికి గ్రామంలో కేవలం సుమారు 110 మందినే లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. ఈ నెల 21న జరిగిన గ్రామసభలో జాబితా వివరాలను అధికారులు చదివి వినిపించారు. అయితే పథకానికి కొందరినే ఎంపిక చేశారని, ఆ జాబితాలో అనర్హుల పేర్లు ఉన్నాయని, భూమి లేని నిరుపేదల పేర్లు లేవని స్థానికులు గ్రామసభలో ఆందోళన చేశారు. ఈవిషయంపై పార్టీలకతీతంగా నాయకులు.. అధికారులను నిలదీశారు. దీంతో గ్రామ సభ మధ్యలోనే ఆగిపోయింది. కాగా, తమకు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించకపోవడంతోనే పథకానికి తాము ఎంపిక కాలేదని గ్రామానికి చెందిన అనేక మంది భూమి లేని నిరుపేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పించిన వివరాలు ఇవ్వాలని శనివారం పలువురు గ్రామస్తులు ఎంపీడీఓ కార్యాలయంలో సమాచర హక్కు చట్టం కింద వినతి పత్రం అందజేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కూడా ఫిర్యాదు చేయనున్నట్లు పలువురు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ లేక..

కాగా, చిలుకూరు మేజర్ గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ గత ఐదేళ్ల క్రితం సస్పెండ్ అయ్యారు. నాటి నుంచి ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించలేదు. దీంతో గ్రామానికి చెందిన సీనియర్ మేట్ ఉపాధి హామీ పనులు చేయించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయనే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాపై విచారణ చేపట్టడం ఇప్పుడు పలు విమర్శలకు దారి తీసింది. గతంలో తమకు అనుకూలంగా ఉన్న వారికే పనులు కల్పించారని, ఇప్పటికే అదే విధంగా వ్యవహరిస్తున్నారని పలువురు గ్రామస్తులు మండి పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఉపాధి హామీ పనుల వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి భాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం జాబితాలో అర్హులందరి పేర్లు చేర్చాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

సదుపాయాలు అందకపోతే జడ్జి దృష్టికి తేవాలి

- ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి సురేష్



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి సురేష్

హుజూర్‌నగర్ : జైలులో ఉన్న ఖైదీలకు విద్య, వైద్యం, భోజన సదుపాయాలు ఉంటాయని, ఇవి అందకపోతే స్థానిక జడ్జి దృష్టికి తీసుకెళ్లాలని హుజూర్‌నగర్ ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి సురేష్ సూచించారు. శనివారం హుజూర్‌నగర్ సబ్ జైలులో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. కేసు విచారణ సమయంలో జైలులో ఉన్న ఖైదీలను పోలీస్ ఎస్కార్టుతో కోర్టులో హాజరు పర్చాల్సి ఉంటుందన్నారు. జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ మాట్లాడుతూ స్వతహాగా న్యాయవాదిని నియమించుకునే స్థోమత లేని ఖైదీలకు న్యాయ సేవా అధికార సంస్థ తరపున ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామన్నారు. అనంతరం ఖైదీలకు పండ్లు పంపిణీ చేశారు. సీనియర్ న్యాయవాది కాల్వ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో హుజూర్ నగర్, కోదాడ బార్ అసోసియేషన్‌ల సభ్యులు ప్రదీప్తి, దీపిక, హేమలత, దుర్గా, శిల్ప, క్రాంతి, చనగాని యాదగిరి, నాగేష్ రాథోడ్, ఒట్టికూటి అంజయ్య, సైదా హుస్సేన్, రమణారెడ్డి, వెంకట్‌రెడ్డి, రామ లక్ష్మారెడ్డి, మద్దుల నాగేశ్వరరావు, రమేష్, నాగపాష, మందా వెంకటేశ్వర్లు, వెంకటాచలం, దొడ్డ శ్రీధర్, నాగరాజు, నాగూర్ భాష, జైల్ సూపరింటెండెంట్ మంగ్తా నాయక్, జైల్ వార్డర్ మంత్రి ప్రగడ సీతారామచంద్రరావు పాల్గొన్నారు.

కొబ్బరికాయలు, ప్రసాదాల విక్రయానికి వేలం

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరి సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల సందర్భంగా ఫిబ్రవరి 26 నుంచి మార్చి 2వ తేదీ ఆలయం వద్ద కొబ్బరికాయులు, లడ్డూ, పులిహోర ప్రసాదం అమ్ముకొనుటకు శుక్రవారం వేలం నిర్వహించారు. కొబ్బరికాయలు విక్రయించుకునే హక్కును రూ.2.80 లక్షలకు, లడ్డూ, పులిహోర ప్రసాదాలు అమ్ముకొనుటకు రూ.3.35 లక్షలకు, కొబ్బరిచిప్పలు సేకరించుకునేందుకుగాను రూ.38 వేలకు వేలంలో పలువురు దక్కించుకున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఆలయానికి మొత్తం రూ.6.53 లక్షలు ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. గత సంవత్సరం కంటే రూ.24 వేలు అధికంగా ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు లక్ష్మణరావు, కొండారెడ్డి, రెనివేషన్ కమిటీ చైర్మన్ శంభిరెడ్డి పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి మున్సిపల్ పాలకవర్గం కృషి



కోదాడ : సమావేశంలో మున్సిపల్ పాలకవర్గం, అధికారులతో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ : కోదాడ పట్టణాభివృద్ధికి మున్సిపల్ పాలకవర్గం చేసిన కృషి అభినందనీయమని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. ఆదివారంతో కోదాడ మున్సిపల్ పదవీకాలం ముగియనుంది. ఈ సందర్భంగా కోదాడ మున్సిపాలిటీ పాలకవర్గానికి నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్, వైస్‌చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లను ఆమె సన్మానించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, కమిషనర్ రమాదేవి, 34 వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకవర్గ సహకారం మరువలేనిది

హుజూర్‌నగర్ : గత ఐదేళ్లుగా హుజూర్‌నగర్ మున్సిపాలిటీని అభివృద్ధి చేయడంలో పాలకవర్గ సహకారం మరువలేనిదని మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చన రవి అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లో మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కౌన్సిలర్లుగా పదవి చేపట్టిన నాటి నుంచి ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నామని అన్నారు. సభ్యుల సహకారంతో అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులను సమర్థంగా చేపట్టామని ఆమె తెలిపారు. తమకు పదవి కాలంలో ప్రజలకు సేవ చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందని ఆమె పేర్కొన్నారు. ఒక్కో వార్డులో రూ.15 లక్షలతో అభివృద్ధి పనులు చేట్టాలని ఈ చివరి సమావేశంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. పాలకవర్గ పదవీకాలం ముగుస్తున్నందున సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, అన్ని వార్డుల కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : సమావేశంలో పాల్గొన్న పాలకవర్గ సభ్యులు

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం



కోదాడ : బాలుర పాఠశాలలో ముగ్గులను పరిశీలిస్తున్న తహసీల్దార్



హుజూర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది



మునగాల : విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ ఆంజనేయులు

హుజూర్‌నగర్ : పట్టణంలో శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఓటుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని అన్నారు. అనంతరం ఓటును సక్రమంగా వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, ఎంపీడీఓ లావణ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో మాక్ పోలింగ్..

జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని హుజూనగర్‌లోని డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్రం, ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2ల ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామారావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సునంద, బి.శ్రీనివాస్, నగేష్, ఎస్.బాలరాజు, బి.నాగార్జున, జి.స్వాతి, పి.శ్రీనివాస్, జి.శ్రీకాంత్, ఏ.మాలతి, వి.రాధ విద్యార్థులు పాల్గొన్నారు.

చింతలపాలెంలో..

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన చింతలపాలెంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండల కేంద్రమైన చింతలపాలెంలో శనివారం తహశీల్దార్ సురేందర్ రెడ్డి ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీటీ సుధారాణి, ఎంఆర్ఐలు ఆత్రేయ, వాసు సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోదాడలో బైక్ ర్యాలీ..

కోదాడ : పట్టణంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ సూర్యనారాయణ ఆధ్వర్యంలో కోదాడ ఆర్డీఓ కార్యాలయం నుంచి రంగా థియేటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కోదాడ బాలుర పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ముగ్గులను కోదాడ తహసీల్దార్ వాజిద్‌అలీ పరిశీలించి విజేతలకు బహుమతులు అందజేశారు. కోదాడ కేఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఓటరు దినోత్సవంలో విద్యార్థుల చేత కళాశాల ప్రిన్సిపాల్ హెడ్సరాణి, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేయించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

నేరేడుచర్ల : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, స్పందన జూనియర్ కళాశాలలో శనివారం లయన్స్ క్లబ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ, అధ్యాపకులు సైదులు, స్పందన జూనియర్ కళాశాల కరస్పాండెంట్ కట్ట ప్రవీణ్‌రెడ్డి, క్లబ్ జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుండ్రెడ్డి సైదిరెడ్డి, పూర్ణచందర్‌రెడ్డి, రాపోలు నవీన్, అధ్యాపకులు నగేష్, శ్రీనివాసాచారి, సైదిరెడ్డి, ఆంజనేయులు, కావ్య తదితరులు ఉన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయంలో..

నడిగూడెం : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఓటర్లకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. తొలుత సిబ్బంది ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది వెంకటేశ్వర్లు, బీఎల్ఓలు పాతకొట్ల కొండలమ్మ, పందిరి సవిత, ఎలుగూరి కవిత, ఓటర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల పదర్శన

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని చింతలపాలెం పరిధిలో గల సీతా మెమోరియల్ స్కూల్‌లో శనివారం విద్యార్థులు 76 ఆకారంలో కూర్చుని ప్రదర్శన నిర్వహించి ఆకట్టుకున్నారు. హెచ్ఎం పీజే ధామస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

మునగాల : జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మునగాల మండల కేంద్రంలోని నాల్గవ అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో నూతన మహిళా ఓటర్లకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు తహసీల్దార్ వి.ఆంజనేయులు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు జి.సంధ్యారాణి, కె.అనిత, అనంతుల శ్రీనివాస్, టి.మాణిక్యం, ఎస్.మణెమ్మ, డి.కృపారాణి, పి.ఎల్లమ్మ పాల్గొన్నారు.



నేరేడుచర్ల : విజేతలకు బహుమతులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు, అధ్యాపకులు



నడిగూడెంలో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది



హుజూర్‌నగర్ : 76 ఆకారంలో కూర్చొని విద్యార్థుల ప్రదర్శన

కోదాడను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా



కోదాడ : మున్సిపాలిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

- కోదాడ ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ : కోదాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. ఆరు కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన మున్సిపాలిటీ నూతన భవన నిర్మాణ పనులకు శనివారం ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ ఏర్పాటు చేయడంతో పాటు మాస్టర్‌ప్లాన్ తయారు చేసి మోడల్ పట్టణంగా తీర్చిదిద్దుతామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, మున్సిపల్ పాలకవర్గం, అధికారులు పాల్గొన్నారు.

హడావుడిగా శంకుస్థాపనపై విస్మయం

కాగా, మున్సిపల్ పాలకవర్గం కాలపరిమితి తీరిపోతున్న చివరి రోజు కొత్త భవనానికి హడావుడిగా శంకుస్థాపన చేయడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కేవలం శిలాఫలకంపై పేరు కోసమే ఇలా చేస్తున్నారని పలువురు అంటున్నారు.

అర్హులందరికీ పథకాలు అందిస్తాం

మునగాల : ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, నూతన రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. శనివారం మునగాలలో ఆమె విలేకరులతో మాట్లాడారు. గ్రామ సభల్లో అసలైన లబ్ధిదారుల ఎంపిక జరగలేదని తమకు సమాచారం అందిందని, అర్హులు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామసభలు విజయవంతం అయ్యాయన్నారు. టీపీసీసీ కార్యదర్శి సీహెచ్.లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవేటి రామారావు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య, మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, పనస విజయ్‌కుమార్, తక్కెళ్లపాటి సాయి, ఎలక నరేందర్‌రెడ్డి, నల్లపాటి శ్రీనివాస్, వీరబాబు, నరసింహారావు, కేఎల్ఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

గురుకులాలపై షార్ట్ ఫిలిమ్ అభినందనీయం

మునగాల : ప్రభుత్వ గురుకులాలపై ఉపాధ్యాయులు షార్ట్ ఫిలిమ్ తీయడం అభినందనీయమని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, కళాశాలలను బలోపేతం చేయాలని, ప్రతి విద్యార్థి గురుకులాల్లో చేరి భవిష్యత్తు బంగారు బాటలు వేసుకోవాలని మండలంలోని ఆకుపాముల శివారులో గల మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల ఉపాధ్యాయ బృందం నిర్మించిన 'అక్షరం 'షార్ట్ ఫిలిమ్‌కు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. పాఠశాల గ్రేడ్ -1 ప్రిన్సిపాల్ కె. శోభారాణి, ఏటీపీ గోపాలకృష్ణ, షార్ట్ ఫిలిం దర్శకుడు బచ్చలకూరి సురేష్, మధు, లోకేష్, రాధిక , మట్టయ్య, సుభాని, రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



బీక్యాతండాలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కీసర సంతోష్‌రెడ్డి

మోతె : మండలంలోని బీక్యాతండా, కొత్తగూడెం గ్రామాల్లో శనివారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మారెడ్డి ఆదేశాల మేరకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు చేపట్టిన సీసీ రోడ్ల పనులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్మార్టుఫోన్లు అధికంగా వాడితే అనర్థాలు

హుజూర్‌నగర్ : స్మార్టుఫోన్లు అధికంగా వాడితే అనేక అనార్థాలకు దారి తీస్తుందని ముస్లిం పర్సనల్ లా బోర్డు మెంబర్, మెహర్బా ఫౌండేషన్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు గయాసుద్దీన్ రషీ అన్నారు. శనివారం పట్టణంలోని ఉస్మానియా మసీద్‌లో ముస్లిం మైనార్టీల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలోని మానవుల్లో క్రమశిక్షణ, ప్రేమ, దయాగుణం తగ్గుతున్నాయని, వాటిని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సయ్యద్ రిజ్వాన్, అబ్దుల్‌రహీం, మక్‌సూద్, అబ్దుల్ రహమాన్, మన్సూర్ అలీ, బిక్కన్, సైదా, ఖాదర్, జాన్ సైదా, ఉలమాలు, హాఫిజ్‌లు, ఇమామ్‌లు, మజీద్ కమిటీల బాధ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం



వేడుకలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీసాయి పబ్లిక్ స్కూల్‌లో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అధికారులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ బుస్సా సులోచన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరయ్య, సైదులు, హర్ష, రాంబాబు, రమ్య, మల్లిక, రజియా, లక్ష్మి, వైదేహి, జ్యోతి, నాగమణి, త్రివేణి, విమలకుమారి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు దండోరా వేద్దాం

నడిగూడెం : ఎస్సీ వర్గీకరణ సాధనకు ప్రతి మాదిగ వచ్చే నెల 7న హైదరాబాద్ నడిబొడ్డున దండోరా వేద్దామని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మొలుగూరి సైదులు, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు మిట్టగణుపుల మోష పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని వేణుగోపాలపురంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం బృందావనపురం, వేణుగోపాలపురం గ్రామాల ఎమ్మార్పీఎస్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బృందావనపురం గ్రామ అధ్యక్షుడిగా కంభంపాటి వెంకన్న, ఉపాధ్యక్షుడిగా కంభంపాటి హరినాథ్, ప్రధాన కార్యదర్శిగా మధుసూదన్, కోశాధికారిగా మాతంగి మాధవరావు, వేణుగోపాలపురం గ్రామశాఖ అధ్యక్షుడిగా సంపతి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా సంపతి ప్రసాద్, కోశాధికారిగా సంపతి వెంకన్నను ఎన్నుకున్నారు. ఎంఎస్పీ జిల్లా కోకన్వీనర్ పందిటి నవీన్‌కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, రవి పాల్గొన్నారు.

వైద్యం అందించి.. శునకాన్ని రక్షించి



కుక్కకు వైద్యం చేస్తున్న డాక్టర్ పెంటయ్య

కోదాడరూరల్ : కాలికి సైకిల్ చైన్ చుట్టుకొని నడవలేక చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఓ కుక్కకు వైద్యం చేసి పునర్జన్మనిచ్చాడు వెటర్నరీ వైద్యుడు. ఈ ఘటన శనివారం కోదాడ పట్టణంలో జరిగింది. కోదాడ పట్టణంలో జర్మన్‌షెపర్డ్ జాతి కుక్కను పెంచుకుంటున్న ఓ వ్యక్తి.. దాని పోషణ భారంగా మారిందేమో తెలియదు కాని దానిని వీధిలో వదిలేశాడు. వీధుల్లోనే తిరుగుతున్న ఆ కుక్క కాలికి ప్రమాదవశాత్తు సైకిల్ చైన్ చుట్టుకొని ఎముక తేలి నడవడానికి కూడా వీలు లేకుండా అయింది. తిండిలేక రోడ్డు పక్కన బక్కచిక్కి ఉంది. ఇది గమనించిన స్థానికుడు అమరబోయిన వీరబాబు తన స్నేహితుడి సహాయంతో కుక్కను చికిత్స కోసం స్థానిక వెటర్నరీ వైద్యశాలకు తీసుకెళ్లాడు. డాక్టర్ పెంటయ్య సిబ్బందితో కలిసి కుక్కకు మత్తు మందు ఇచ్చి దాని కాలికి చుట్టుకున్న చైన్‌ను తొలగించి కట్టు కట్టి చికిత్స అందించాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న మూగజీవాన్ని వైద్యశాలకు తరలించిన వీరబాబును ఈ సందర్భంగా డాక్టర్ అభినందించారు.

కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

నేరేడుచర్ల : మున్సిపాలిటీ సమస్యలపై కమిషనర్ వద్దకు వెళ్లగా అసభ్యకరంగా మాట్లాడారని, ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం రాత్రి నేరేడుచర్లలోని ప్రధాన కూడలి వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో ఓ పని విషయంపై కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి వద్దకు వెళ్లగా తనను అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు కమిషనర్ కారుతో తనను తొక్కించే ప్రయత్నం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎస్ఐ పట్టించుకోలేదని, ఈ విషయంపై తనకు న్యాయం జరగకుంటే ఆమరణ నిరహార దీక్ష చేపడతామని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.